


ఇరవయ్యేళ్ల లైలా కాటేజీ గేటు వద్ద నిల్చుంది. దూరంగా పొలాలు. నెమ్మదిగా సాగే తెల్లని మబ్బులు. మరో వైపు రైల్వే స్టేషన్‌లో యింజన్ పొగలు. వాతావరణంలో ఒక ప్రశాంతత. ఈ వూళ్లలో ఎప్పుడూ ఏమీ జరగదు. అంతా నిస్తబ్ధత. అందమైన ఆమె మొహంలో ఏదో పోగొట్టుకున్న విచారం.

ఏడాది క్రితం ఎలా వుండేది జీవితం. బోర్డింగ్ స్కూల్లో, ఆడుతూ పాడుతూ తూనీగల్లా తిరిగే పిల్లలు. ప్రారంభ యవ్వనపరిమళాలు. నవ్వంటే ఎరగని ప్రిన్సిపాలు, ఒక నాడు గ్రూపు ఫొటో కోసం స్టూడియోకి తీసికెళ్లింది.

"జాగ్రత్త అబ్బాయి, యువకుల ఫొటోలు వీళ్ల కంట పడనియ్యకు" అని మరీ మరీ చెప్పింది ఫొటోగ్రాఫర్‌కు. యువకుల బొమ్మలు చూసి ఆడపిల్లలు పాడైపోతారని ఆమె నమ్మకం. తండ్రులూ, అన్నలూ తప్ప పరపురుషులు లేరీ లోకంలో. ఆమె జీవితం అలాగే గడిచింది మరి.

ప్రిన్సిపాలుగారి అమాయకత్వానికి, పిల్లలు తమలో తామే నవ్వుకునేవాళ్లు.

రక్తసంబంధంలేని అందమైన కుర్రాళ్లు కూడా వుంటారు. క్రీడాకారులు. పూలరంగళ్లు. కవులు, కళాకారులు, లక్షాధికార్లు.

తప్పక, ఒక హీరోతోనే తన పెళ్లి జరిగిందనుకున్నది లైలా. ఆరడుగుల, నూనూగు మీసాల, గిరజాల జుత్తున్న యువధీరుడు. టర్జెనీవ్ కథల్లో లాంటి హీరో. అభ్యుదయ భావాల మేధావి.

ఏడాది తిరక్కుండా పెళ్లైంది. భర్తకు చదువూ, అందం, గౌరవం అన్నీ వున్నాయి. కాని తన కలల కథానాయకుడి కున్నంత సౌకుమార్యమూ, ధీరోదాత్తతా, షివలీ లేవు.

ఠంచనుగా, వుదయం నిద్రలేచి (ఓ నిమిషం అటూ యిటూ కాదు. సరిగ్గా అదే సమయానికి లేవాలి) షేవింగ్ చేసుకుంటాడు. అయిదు నిమిషాలు ఆలస్యమైతే ఏదో కొంప మునిగినట్టు. ఎప్పుడూ బిజీగా, ఏదో ఆలోచిస్తూ వుంటాడు. లేదా అలా పోజు పెడతాడు. ఇస్త్రీ బట్టలేసుకొని, (మొక్కుబడిగా) ముద్దుపెట్టి ఇన్సూరెన్సు కంపెనీ (అక్కడే పని చేస్తాడు) కి బయలుదేరుతాడు. ఈ మనిషిక్కడేం చేస్తాడూ? కాగితాలు కాపీ చెయ్యటమేనా లేక

# ఆయన

**రష్యన్‌మూలం: చెహోవ్**

**తెలుగు గొంతు: కరుణాకరుణ**



కంపెనీ పాలసీ నిర్ణయాలు గురించిన చర్చల్లో పాల్గొంటాడా? తెలియదు.



సాయంత్రం రాగానే "అలసి పొయ్యాను" అంటూ, దుస్తులు మార్చుకొని వచ్చి, భోజనాని క్కూచుంటాడు. ఏదీ వదిలి పెట్టడు. బాగానే తింటాడు. డిన్నరు చేసే క్రమంలో స్త్రీవాద సమస్యల్నో, ఆర్థిక, దేశ సమస్యల్నో పరిష్కరిస్తాడు. విదేశాంగవిధానాన్ని కూడా విశ్లేషిస్తాడు. రాజకీయాలు, శాస్త్ర ప్రగతి, కళారంగం, విద్యావిధానం-అన్నింటి గురించీ ఆయనకు అభిప్రాయాలున్నాయి.

"ఆధునిక యువత నైతికంగా దిగజారుతున్నది."

భోజనం ముగిసేలోగా ప్రపంచసమస్యలన్నీ పరిష్కారమయితే ఎంత బాగుండును! ఈయన వుద్రేకంగా ప్రసంగిస్తుంటే టేబుల్ దగ్గిర కూర్చున్న అతిథులు విసుగ్గా మొహం పెడతారు. ఆ మాటలన్నీ అడ్డుకునే ఓపిక లేక అవునని తలాడిస్తారు.

"సాహిత్యంలో స్వర్ణయుగం అవతరించింది" అంటూ ప్రారంభిస్తా డొకనాడు. ఆయన పుస్తకాలూ, పేపర్లూ చదవడు. అయినా సాహిత్యాన్ని గురించి వ్యాఖ్యానించగలడు. టర్జనీవ్‌కూ, డాస్టవస్కీకే తేడా చూడలేదు. ఒకరి గురించి అనుకొని, మరొకరి గురించి మాట్లాడతాడు. ఏ కార్టూనూ ఆయనకు నవ్వు తెప్పించదు. సాల్టికోవ్ షెడ్రిన్ రచనలు (ప్రసిద్ధ వ్యంగ్యరచయిత) 'చాలా సీరియస్‌గా వుంటాయంటాడు. అంతేకాదు. పుష్కిన్‌లో చాలా వ్యంగ్యం కనిపిస్తుంది. (అదే సమస్య. ఒక పేరుకు బదులు మరొక పేరు).

భోజనం తర్వాత, డాబా మీది కుర్చీలో కూలబడి దీర్ఘాలోచన చేస్తాడు. ఆ ఆలోచన ఓ పట్టాన తెగదు. కళ్లు మూతలు పడతాయి. నొసలు ముడతలు పడుతుంది. ఆయన ఏమాలోచిస్తున్నాడు. లైలా వూహకైనా అందదు. కొత్త సత్యాలేవో తెలుసుకునే వుంటాడు. కాని ఆ రెండు గంటల తర్వాత కూడా ఆయన మాటల ధోరణిలో మార్పేమీ వుండదు.

సాయంత్రం కాసేపు పేకాడతారు. అక్కడా సీరియస్‌గానే వుంటాడు. ప్రతి ముక్కా ఆలోచించి ఆలోచించి వేస్తాడు. పేకాట తర్వాత, మేధాలోకంలో మరి కాసేపు విహరించి నిద్రలోకి జారుకుంటాడు. పుస్తకంలా పడుకుంటాడు. అప్పుడప్పుడూ పలవరిస్తాడు. కానీ అదంతా అర్థం కాని చెత్త.

లైలాకు వాళ్లాయన గురించి మరే ఆలోచనలూ లేవు. తోటలో నిల్చుని, తనకు తెలిసిన యితర యువకుల్తో ఈయన్ని పోల్చి చూసుకుంటుంటే 'పరవాలేదు' అనిపించింది. పురుషులంతా ఒకటే అయినప్పటికీ, ప్రిన్సిపాల్ లాగా భయపడక్కర్లేదు. ■

## అద్దీ, అలాగుండాలి!

అరడజన్ చిత్రాలు ఫ్లాపైపోయినా స్మాల్ బీగా అభిషేక్ బచ్చన్ ప్రాధాన్యం తగ్గలేదు. వరస పెట్టి మరో ఆరు చిత్రాల్లో చేయటానికి అంగీకరించాడు. వివేక్ ఒబెరాయ్, అజయ్ దేవగణ్, సంజయ్ దత్ హీరోలుగా వున్న చిత్రాల్లో చేస్తున్నాడు. 'రన్' చిత్రం షూటింగులు ప్రారంభమయ్యాయి. రాజ్‌కుమార్ సంతోషి, రామ్‌గోపాల్‌వర్మల చిత్రాలూ వున్నాయి. ప్రస్తుతం 'ముంబయి సే ఆయా మేరా దోస్త్, మైం ప్రేమ్ కీ దీవానీ హూం' చిత్రాలు విడుదలకు సిద్ధంగా వున్నాయి. మరో చిత్రం 'కుఛ్ నా కహో' ఐశ్వర్య హీరోయిన్‌కూడా రెడీ అవుతోంది.

## టీవీ వల్ల దురలవాటు?

ఎక్కువ సేపు టీవీ చూస్తే కళ్లు దెబ్బతింటాయనేది అందరూ అనుకునే సంగతే. కానీ, అదే పనిగా టీవీ చూడటం వల్ల పిల్లల్లోనూ మద్యపానం చేయాలనే కోరిక కలుగుతుందంటున్నారు స్టెన్ ఫోర్డ్ వైద్యనిపుణులు. వెయ్యి మంది పిల్లలను పరిశీలిస్తే, రోజుకు రెండు గంటల చొప్పున మ్యూజిక్ వీడియోలు చూసేవారిలో, పద్దెనిమిది నెలల్లో తాగితే ఎలాగుంటుందో చూడాలనే కుతూహలం పెరిగిందట. టీవీలో కనిపించే సెలెబ్రిటీస్ తాగటం వల్ల పెద్దగా దుష్పరిణామాలు కలగవన్నట్లుగా చూపించటమే ఇందుకు కారణమట. సో, తల్లిదండ్రులూ, పిల్లలు ఎలాంటి చిత్రాలు చూస్తున్నారో ఓ కన్నేసి వుండటం అవసరం!

